# 'నన్నూ బ్రోవమనీ చెప్పవే'!

'నన్నూ బ్రోవమనీ చెప్పవే సీతమ్మ తల్లీ నన్నూ బ్రోవమనీ చెప్పవే...

పాట పూర్తిగా రాకపోయినా ఈ రెండు లైన్లూ పాడుకుంటూ పదే పదే, తన సొంత బాణీలో ఆలాపన తీసుకుంటూ కూర్చున్నాడు తన సీట్లో పాండురంగం.

"ఏమిటోయ్ రామదాసు కీర్తనే మొదలెట్టావ్? నీకు సంగీతం కూడా ఒచ్చేమిటి" అడిగాడు శేషశాయి.

"ఈ కీర్తనని కాస్త వాడుకోమని సలహా ఇస్తున్నాను సుధాకర్‌కి" అన్నాడు నవ్వుతూ పాండురంగం.

"అంటే?"

"అంటే, వాడికీమధ్య నల్లగొండకి ట్రాన్స్‌ఫర్ అయిందిగా. గోల పెడుతున్నాడు. వాడు పుట్టినప్పటి నుంచీ ఏ ఊరూ వెళ్ళలేదుట. చిన్నప్పుడు అమ్మా, ఇప్పుడు భార్యా మరో స్త్రీ మొగమైనా తలెత్తి చూళ్లేదుట ఎన్నడూ. కనీసం వాడికి, సోదరీ మణులుకూడా లేరుట. ఆడాళ్లతో మాట్లాడాలంటే సిగ్గు. తోటి మగాళ్లతో మాట్లాడాలన్నా బెదురు. పాపం, నలభై య్యోపడిలో పడ్డా! అమ్మా, ఆలీ వాళ్లిద్దరూ తప్ప మరో ప్రపంచం తెలీదు వాడికి! పొరుగూరికి వెళ్లి ఎలాబతుకుతాడో ఏమో, అని వాళ్ళమ్మ కంటతడి పెట్టుకుంటూ నిన్న మా ఇంటికొచ్చింది. ఈ ట్రాన్స్‌ఫర్ ఎలాగైనా ఆపుచేయించమని వాడికో కిటుకు చెప్పా.

"అమ్మో! అంటున్నాడు" అన్నాడు పాండురంగం నవ్వుతూ.

శేషశాయి పాండురంగం కేసి ఆశ్చర్యంగా చూస్తూ "అదేం కిటుకుసార్! కాస్త నాక్కూడా చెప్పండి. ఎందుకైనా పనికొస్తుంది" అన్నాడు.

"మన దయాసాగర్ వున్నాడా?"

"వున్నాడు"

"వాడికి ప్రమోషనొచ్చిందా?"

"ఒచ్చింది."

"వాడికంటే సీనియర్లు ఎంతమందున్నారు?"

"ముగ్గురు. కానీ వాళ్లెవరూ ఆదిలాబాద్ వెళ్లమన్నారు కదసార్. దయాసాగర్ వెళతానన్నాడు."

'కదా?"

"ఆ..."

"వెళ్ళి ఎన్నాళ్లున్నాడక్కడ?"

'ఎన్నాళ్లేంటిసార్! పట్టుమని పదిహేను రోజులున్నాడేమో! సగం రోజులు ఆదివారాలనీ, ఇతర సెలవులనీ, ఇక్కడే వుండేవాడుగా."

"అదిసరే! వెంటనే హైదరాబాద్ కెలావొచ్చేశాడనుకున్నావ్?"

"అదే, అందరికీ ఆశ్చర్యంగా వుందిసార్!"

"ఊ... అర్థం కాలేదన్నమాట!"

"లేదుసార్" కళ్లు పెద్దవిచేసి ఒళ్లు దగ్గరుంచుకుని వినడం మొదలెట్టాడు శేషశాయి.

పాండురంగం కిటికీ దగ్గరికెళ్లి జరదా పాను ఉమ్మేసొచ్చాడు. చెప్పడం మొదలెట్టాడు.

"ఏముందీ! ననూ బ్రోవమని చెప్పవే..." రాగం తీసి పాడుతూ

"ఈ పాట పాడేసేడోయ్? అంతే! ఆపళంగా, అతనికి ట్రాన్స్ఫర్ అయి కూర్చుంది!

"అంటే ఆ రామచంద్రుడికి దయకలిగి, రామదాసుని బందికానా నుంచి విడిపించినట్టుగానా సార్!"

"కరెక్టుగా చెప్పావ్?"

"అంటే ఇలా జరుగుతుందనీ, దేముడున్నాడనీ మీరు నమ్ముతున్నారా సార్!" ఆశ్చర్యబోతూ అడిగాడు శేషశాయి.

"పిచ్చివాడా! ఈ పాట పాడింది ఆ శ్రీరామచంద్రుడి దగ్గర కాదోయ్! మన 'బాస్' దగ్గర!"

"ఆ!... అంటే ఆయనకి ఈ పాటంటే ఇష్టమాసార్!"

"నీకు బ్రైన్ లేదయ్యా" నవ్వాడు పాండురంగం.

శేషశాయి చిన్న బుచ్చుకుంటూ తలొంచుకున్నాడు.

అది చూసి పాండురంగం మళ్లీ చెప్పడం మొదలెట్టాడు.

"మన సుధాకర్ ఈ పాట పాడింది మన 'బాస్' దగ్గర కాదయ్యా ఆయనగారి వైఫ్ దగ్గర."

శేషశాయి మరింత ఆశ్చర్యబోతూ "ఆవిడకిష్టమా సార్ ఈ పాట" అన్నాడు.

పాండురంగంకి ఒళ్లు మండింది. "నువ్వు బొత్తిగా ఇంత మందమతి వేమయ్యా! ఇంకా అర్థం కాలేదూ!"

శేషశాయి బుర్రలో ఆలోచన గిర్రున తిరిగి, మెఱుపులా మెరిసింది.

"అర్థమైంది సార్! ఓహో! ఆవిడతో తన గోడంతా చెప్పుకునీ, ఆవిడ గారిచే 'బాస్'కి రికమెండ్ చేయించుకున్నాడన్నమాట. మైగాడ్! హెూం

డిపార్టుమెంటు ఆర్డరు వేస్తే ఇంక తిరుగేముందీ?" మతిపోయిన వాడిలా!

"ఏమిటాలోచిస్తున్నావ్?" అడిగాడు పాండురంగం శేషశాయిని.

"వెర్రివాడా! సీతమ్మా తల్లిని వేడుకుంటూన్నప్పుడు ఊరికే వెళతారా ఎవరైనా? పళ్లూ, ఫలం, పుష్పం తోయం, ఏదో ఒకటి తీసికెళ్లి నైవేద్యం పెట్టి మరీ ప్రార్థించాలి నాయనా!"

"అవునాండీ?"

"అంతేకదా మరి! నీ భక్తికి నిదర్శనం కావొద్దూ?"

"మైగాడ్! మరీ..."

"మరీ లేదు, గిరీ లేదు. దయాసాగర్‌కి కూడా తన పని నిర్విఘ్నంగా కొనసాగి పోవాలంటే, చేతులు ముడుచుకుని కూర్చుంటే లాభం లేదు. రామచంద్రులవారితో విన్నవించుకోవడానికి కూడా టైములేదు. అందుకనీ, అమ్మగారి దగ్గర ఈ పాట పాడేస్తే ఏ అర్ధరాత్రో అపరాత్రో అమ్మగారు ఈ మాట బాస్‌గారి చెవిలో పడేస్తారు. పనై పోతుంది. అంతేకాని ఇలా దిగాలుగా కూర్చుంటే ఏం లాభం?"

"నే వెళ్లి దయాసాగర్‌కి చెప్పనాసార్?"

"చెప్పు! పాట భక్తితో పాడాలి సుమా! నైవేద్యం పెట్టడం మర్చిపోవొద్దూ అని చెప్పు."

"అలాగేసార్!"

"శుభమస్తూ! రామదాసూ! నువ్విలాకూ్కడా పనికొస్తున్నావయ్యా! ఈ యుగంలో నీకు తగ్గసాయం నువ్వూ చేస్తున్నావయ్యా! ఎంతైనా నువ్వు ఘటికుడివి. నీకు నువ్వేసాటి! ఎవరికి కావలసిన విధంగా వారు వాడుకునేలా ఎంతో దూరదృష్టితో రచనలు చేశావు" అనుకుంటూ, జేబులోంచి కిళ్లీ పొట్లాన్ని తీసి, కారాకిళ్లీ దంతాల కింద పెట్టుకుని నములుతూ, ఫైళ్లు చూడ్డాని కుపక్రమించాడు పాండురంగం!

★